

అరె లక్ష్మీనర్సు (ఫైల్)



బల్గూరి వెంకటేశ్వర్లు(ఫైల్)

## విద్యుత్తు శాఖ నిర్లక్ష్యానికి ఇద్దరు రైతుల బలి

- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తిలో స్టార్టర్ మరమ్మతు చేస్తుండగా ఒకరు మృతి
- రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో ఫ్యూజ్ వేస్తుండగా విద్యుత్తు షాక్
- చికిత్స పొందుతూ రైతు మృతి

ముస్తాబాద్/ వర్ధన్నపేట, ఫిబ్రవరి 27: విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి ఇద్దరు రైతులు బలయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తికి చెందిన రైతు బల్గూరి వెంకటేశ్వర్లు(51) వరి పంటను సాగు చేస్తున్నాడు. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్ ఆఫ్ సిస్టమ్ సరిగా లేకపోవడంతో విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో మోటర్లు సరిగా నడవకపోవడంతో వరి పొలం ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. ఈ విషయమై పలుమార్లు విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయింది. గురువారం పొలానికి నీరు పారించేందుకు వెళ్లిన వెంకటేశ్వర్లు స్టార్టర్ వద్ద ఏర్పడిన సమస్యను పరిష్కరించేందుకు యత్నిస్తుండగా విద్యుత్తుషాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క పొలాల రైతులు గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మరో ఘటనలో రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన రైతు ఆరె లక్ష్మీనర్సు(54) వారం రోజుల క్రితం పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు ఆయనను సిద్దిపేట దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లో దవాఖానకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. గురువారం నామాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య భూలక్ష్మి, కొడుకు నవీన్, కూతురు మౌనిక ఉన్నారు.

# మోదీ డైరెక్షన్‌లో రేవంత్ అడుగులు

- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, బీజేపీ దోస్తీ
- కల్వకుంట్ల కుటుంబమే సీఎం టార్గెట్
- సంబంధంలేని కేసులు అంటగట్టే కుట్ర
- అహంకారానికి రేవంత్ కేరాఫ్ అడ్రస్
- కాంగ్రెస్ హయాంలో కూలిన 4 ప్రాజెక్టులు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్



గురువారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ డైరెక్షన్‌లోనే సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారని, కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రతీ విషయంలో ఆయన బీజేపీతో కలిసి పనిచేస్తున్నారని, బీజేపీ నేతలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దగ్గరుండి కాపాడుతున్నారని తెలిపారు. ఏదైనా అంశంలో తాము వాస్తవాలు బయటపెట్టగానే, బీజేపీ నాయకులు తమపైనే ఆరోపణలు చేస్తున్నారని, దీన్నిబట్టే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మధ్య దోస్తీ బట్టబయలైందని ఆరోపించారు. ప్రధానిని కలిసిన తర్వాతే కేసీఆర్, కేటీఆర్‌పై కేసులు పెడతామంటూ రేవంత్‌రెడ్డి సంబంధం లేని విషయాలను అంటగట్టే కుట్రకు దిగారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు రక్షణ కవచంగా ఉన్న కేసీఆర్ కుటుంబాన్ని, బీఆర్‌ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టాలన్నదే ఆయన ఆలోచనగా ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్‌ఎస్‌పై కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఓ న్యాయవాది కోర్టులోనే వాదిస్తూ అందరి ముందే ఆరు నెలల క్రితమే గుండెపోటుతో మరణించారని, భూపాలపల్లిలో భూతగాదాల వల్లే ఓ హత్య జరిగినట్టు జిల్లా ఎస్పీ చెప్పారని, దుబాయ్‌లో ఓ వ్యక్తి నిద్రలోనే చనిపోయారని పత్రికల్లో వచ్చిందని వివరించారు. వీటన్నింటికీ కేసీఆర్ కుటుంబానికి, బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధంలేకున్నా, రేవంత్‌రెడ్డి అంతులేని అబద్ధాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంబంధం లేని అంశాల గురించి ప్రధానిని కలిసిన తర్వాతే సీఎం మాట్లాడారని, దీన్ని బట్టే కుట్ర జరుగుతున్నట్టు స్పష్టమవుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానిని కలిసిన తర్వాత తన సోదరుడు తిరుపతిరెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి అని సీఎం ప్రకటించారని, మరి అధికారిక కార్యక్రమాల్లో ఆయన ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. గుమ్మడి నర్సయ్య వంటి ప్రజానేతను గేటు బయటే నిలబెట్టి రేవంత్‌రెడ్డి అహంకారాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. అహంకారానికి, కుటుంబ పాలనకు కేరాఫ్ అడ్రస్ రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు.

### 'ఎస్‌ఎల్బీసీ'పై సీఎం పచ్చి అబద్ధాలు

బీఆర్‌ఎస్ హయాంలో ఎస్‌ఎల్బీసీ పనులే జరగలేదని సీఎం పచ్చి అబద్ధాలు చెప్పారని కవిత మండిపడ్డారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాలులో ఎస్‌ఎల్బీసీ ప్రాజెక్టుపై కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేశారని ఆమె గుర్తుచేశారు. ఎస్‌ఎల్బీసీ టన్నెల్ విషయంలో అప్పటి ప్రతిపక్ష నేత జానారెడ్డిని ముందుపెట్టి కాంట్రాక్టరుకు రూ.100 కోట్లు అడ్వాన్స్‌ను కేసీఆర్ ఇచ్చారని స్పష్టంచేశారు. కరోనా తర్వాత కాంట్రాక్టరు పనులు చేపట్టలేమంటే మళ్లీ రూ.100 కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీ 30 ఏండ్లలో ఈ ప్రాజెక్టుపై రూ.3,340 కోట్లు ఖర్చు చేస్తే, పదేండ్లలో కేసీఆర్ రూ.3,890 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఇంత ఖర్చు పెట్టి 11 కి.మీకుపైగా టన్నెల్ తవ్వి పనులు చేస్తే.. పనులే జరగలేదని రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐరన్ లెగ్ కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే 4ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని ధ్వజమెత్తారు.

### వడ్డీల విషయంలో సీఎం తప్పుడు లెక్కలు

నెలకు రూ.6,500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నామంటూ సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని కవిత మండిపడ్డారు. కాగ్ నివేదిక ప్రకారం ఏ నెల కూడా రూ.2,600 కోట్లకు మించి వడ్డీ చెల్లించలేదని తెలిపారు. ప్రతీ నెలా రూ.18 వేల కోట్ల ఆదాయం వస్తున్నదని సీఎం చెప్తున్నారని, కాగ్ లెక్కల ప్రకారం రాష్ట్రానికి రూ.12 వేల కోట్లకు మించి ఆదాయం రాలేదని స్పష్టం చేశారు. మరి ఈ అబద్ధపు లెక్కలు ఎందుకు, ఎవరిని మభ్యపెట్టడానికని ప్రశ్నించారు.

## లోకం పోకడ




నష్టాలు భరించలేరట.. ఖాళీగా ఉన్న ఏరియాలో లారీలు, ఆటోలు పార్కింగ్‌కు అద్దెకిస్తారట సార్!

# కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తగులుతది

- నీళ్లుండి ఇవ్వలేని దుస్థితి దాపురించింది
- సగం పొలాలు ఎండుతున్నయ్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పొట్టిగుట్టతండాలో ఎండిన పొలాలను పరిశీలిస్తున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఫిబ్రవరి 27: కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తగులుతుందని మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పొట్టిగుట్ట, దేవునిగుట్ట తండాల్లో గురువారం ఆయన పర్యటించగా, రైతులు తమ ఎండిన పొలాలను చూపించి పంటలు కాపాడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంటలు నీళ్లు లేక ఎండిపోగా జీవాలకు మేతగా వేస్తున్నారని తెలిపారు. పంటపై ఆశ చావని రైతులు బోర్లు వేస్తూ ఇంకా అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. దేవాదుల నీళ్లు వదిలితే ఇంత కష్టం ఉండకపోయేదన్నారు. నీళ్లుండి వదలలేని దుస్థితి ఈ నియోజకవర్గంలో ఉందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో నవాబుపేట, స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ల నుంచి యాసంగి పంటకు నీళ్లు వదిలేదని గుర్తుచేశారు. సాగునీటి అధికారులకు ఎప్పుడు ఫోన్ చేసినా రెండు రోజుల్లో నీళ్లు వదులుతామని చెబుతున్నారే తప్ప వదలడం లేదన్నారు. ఏ ఊరుకు పోయినా మళ్లీ కేసీఆర్ సారే రావాలని అంటుండ్రని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే కాంగ్రెస్‌ను బొందపెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి రైతుల ఓట్లు దండుకుని, మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూరియా కోసం ఎరువుల దుకాణాల ముందు రైతులు పడిగాపులు కాస్తుండ్రని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని పేర్కొన్నారు.

## బడ్జెట్‌లో వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలి

### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తేతెలంగాణ): వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో కనీసం 20% నిధులు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం ఏఐకేఎఫ్, ఏఐఏడబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 70% మంది ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నా.. పాలకులు మాత్రం వ్యవసాయరంగాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. పెట్టిన పెట్టుబడి రాక ఆర్థిక ఇబ్బందులతో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి సేవలో ఎంపీ వద్దిరాజు దంపతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మి దంపతులు గురువారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని దేవదేవుడిని వేడుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారిని వేదపండితులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

- దళితబంధు నిధుల కోసం నిరసన



దళితబంధు పథకానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దళితులపై సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరారు.

- కొల్లాపూర్ రూరల్



నిర్మల్ జిల్లా లోకేశ్వరంలో యూరియా కోసం రైతులబారులు



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూర్‌లోని పీఏసీఎస్ గోదాం వద్ద క్యూలో ఆధార్, పట్టాదార్ పాసుబుక్కులు పెట్టి పడిగాపులు కాస్తున్న రైతులు

# యూరియా కోసం అగచాట్లు

### క్యూలో రాళ్లు, చెప్పులు, పాస్‌బుక్కులు, ఆధార్ కార్డులు

### కరీంనగర్, నిర్మల్ జిల్లాల్లో తప్పని తిప్పలు

రాయికల్/గొల్లపల్లి/కోరుట్లరూరల్/లోకేశ్వరం, ఫిబ్రవరి 27 : రాళ్లు.. కట్టెలు.. ఇటుకలు.. చెప్పులు.. పట్టాదార్ పాసుబుక్కులు.. ఆధార్ కార్డులు.. ఇలా ఏవి ఉంటే అవి యూరియా కోసం రైతులు క్యూలో పెట్టి యూరియా కోసం నిరీక్షిస్తున్నారు. ఇలాంటి దృశ్యాలు గత కొన్ని రోజులుగా దర్శనమిస్తున్నాయి. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూర్ గ్రామంలోని పీఏసీఎస్ గోదాం వద్ద బుధవారం రాత్రి నుంచే పట్టాదారు పాసు పుస్తకాలను, ఆధార్ జిరాక్స్‌లను క్యూలో పెట్టి యూరియా కోసం పడిగాపులు కాశారు. ఒక్కో రైతు ఒకటి, రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద ఆధార్ కార్డులు, పాస్‌బుక్‌లు వరుసగా పెట్టి క్యూ కట్టారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళనకు దిగారు. కోరుట్ల మండలం పైడిమడుగు పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో యూరియా కోసం ఇటుకలు, చెప్పులు, బండలు, కట్టెలను క్యూలో పెట్టి యూరియా కోసం ఎదురుచూశారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరంలో బుధవారం రాత్రంతా శివరాత్రి జాగారం చేసినరైతులు యూరియా కోసం గురువారం ఉదయం తరలివచ్చారు. ఒక్కో రైతుకు ఐదు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో సరిపోవంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.




జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

# పంటలు ఎండుతున్నా నీరు విడుదల చేస్తలేరు

- తలాపునే రిజర్వాయర్ ఉన్నా పారని కాల్వలు
- జనగామ కలెక్టరేట్, ఇరిగేషన్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన

జనగామ రూరల్, ఫిబ్రవరి 27: 'మా పంటలు ఎండిపోతున్నాయి.. తలాపునే రిజర్వాయర్ ఉండి ప్రతి గ్రామానికి కాల్వలు ఉన్నా నీటిని విడుదల చేయకపోవడం ఏంటని..' రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం జనగామ జిల్లా జనగామ మండలంలోని గానుగుపహాడ్, ఎర్రకుంట తండా, పెద్దపహాడ్, గోపరాజుపల్లి, వడ్లకొండ, బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి రైతులు ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తమ గోడును వెల్లడించారు. అనంతరం గోదావరి జలాలు విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదల చేసి పంటలను కాపాడాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దేవాదుల నుంచి నీటిని పంపింగ్ చేసి బొమ్మకూర్ రిజర్వాయర్‌లో నీటిని నింపాలనే ఆలోచన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా గోదావరి జలాలను కాల్వలకు విడుదల చేసి పంటపొలాలను కాపాడాలని ఇరిగేషన్ అధికారి మంగీలాల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మూడు రోజుల్లో నీటిని విడుదల చేయడానికి కృషి చేస్తానని ఇరిగేషన్ అధికారి తెలిపారు.



గుమ్మడిదల మున్సిపాలిటీలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పాస్టర్లు. రైతు జేఏసీకి విరాళం అందజేస్తున్న పాస్టర్ల ప్రతినిధులు

## డంప్‌యార్డుపై ఆందోళన

### ఎమ్మెల్సీ పోలింగ్‌కు దూరం

గుమ్మడిదల, ఫిబ్రవరి 27 : డంప్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ సంగారెడ్డి జిల్లా గుమ్మిడిదలలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. గురువారం గుమ్మడిదలలో రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్ రెడ్డి అధ్యక్షతన 23వ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగింది. పాస్టర్లు పాల్గొని డంప్ యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేసి, రూ.5 వేల విరాళం అందజేశారు. నల్లవల్లి 23వ రోజున వృద్ధులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కొత్తపల్లిలో 23 రిలే నిరాహార దీక్షలో యువకులు పాల్గొన్నారు. నల్లవల్లిలో మహాశివరాత్రి జాగరణలో భాగంగా దీక్షాశిబిరంలో జవహర్‌నగర్ డంప్‌యార్డు వల్ల అక్కడి ప్రజలు పడుతున్న బాధలు, అనారోగ్య సమస్యలు, పర్యావరణం, భూగర్భజలాల కలుషితం గురించి ప్రొజెక్టర్ ద్వారా స్థానికులు తెలుసుకున్నారు. డంప్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా గుమ్మిడిదల మండలంలో పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు స్వచ్ఛందంగా దూరంగా ఉన్నారు. గుమ్మడిదల పోలింగ్‌స్టేషన్ నంబర్ 425లో పట్టభద్ర ఓటర్లు 295 మంది ఉన్నారు. వీరిలో కేవలం నాన్‌లోకల్ పట్టభద్రులు ఓటర్లు 42 మంది ఓటు వేశారు. 253 మంది స్థానిక పట్టభద్రులు ఓటు వేయకుండా ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. గుమ్మిడిదల మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 19 ఉండగా, 18 పోలయ్యాయి.




అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించాలని రాంనగర్ గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

# తాగునీటి కోసం ఆందోళన


**ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన రాంనగర్ వాసులు • మూడు నెలలుగా వెంటాడుతున్న కష్టాలు**

కులకచర్ల, ఫిబ్రవరి 27 : తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం రాంనగర్ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. గురువారం రోడ్డుపై ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. మూడు నెలల నుంచి మంచినీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీవోకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పొలాలకు వెళ్లి తాగు నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని వారు పేర్కొన్నారు. కలెక్టర్ తమ గ్రామాన్ని సందర్శించి నీటి సమస్యతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.



## కరెంటు లేక పంటలు ఎండుతున్నయ్

ధారూరు, ఫిబ్రవరి 27: కరెంట్ సమస్యతో సకాలంలో నీరందక పంటలు ఎండుతున్నాయని వికారాబాద్ జిల్లా ధారూరు మండలం కెరెళ్లికి చెందిన రైతు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త జితేందర్ రెడ్డి గురువారం ఆందోళన వ్యక్తంచేశాడు. తన జొన్న పంటకు నీరు అందక ఎండుముఖం పట్టిందని బోరుమన్నాడు. కాంగ్రెస్ పాలలో రైతులను ఆదుకునే నాథుడే కరువైనట్టు పేర్కొన్నాడు.



జోగులాంబ గద్వాల జిల్లా మద్దెలబండ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

# కరెంట్ కోతలపై భగ్గుమన్న రైతన్న

**గద్వాల జిల్లా మద్దెలబండ సబ్ స్టేషన్ ఎదుట నిరసన • పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన**

మల్దకల్, ఫిబ్రవరి 27 : విద్యుత్తు సరిగా రాక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మద్దెలబండ సబ్‌స్టేషన్ వద్ద రైతులు నిరసన తెలిపారు. వారం నుంచి గంటకోసారి ట్రిప్ అవుతుండటంతో మోటర్లు కాలిపోతున్నాయని వాపోయారు. పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తంచేశారు. సమస్యను లైన్‌మన్‌కు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఏఈ రాజేశ్ వచ్చి సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.